మమ అనిపించారు..!

- మొక్కుబడిగా తిమ్మాపూర్ మండల సర్వసభ్య సమావేశం
- ప్రజాప్రతినిధుల గైర్హాజరు, మధ్యలోనే సమావేశం ముగింపు

తిమ్మాపూర్: మండల సర్వసభ్య సమావేశం బుధవారం మొక్కుబడిగా సాగింది. మండలంలోని సర్పంచులు గైర్హాజరు కావడంతో మమ అనిపించారు. ఎంపీపీ కేతిరెడ్డి వనిత అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండల శాఖ అధికారులు నివేదిక సమర్పించలేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం, గ్రామాలలో ఫలితాలు అనుకూలంగా రాకపోవడంతో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు హాజరు కాలేదు. పార్టీ అధికారం కోల్పోయిందనే నిరుత్సాహంతో సభకు రాలేదు. దీంతో ఎంపీపీ కేతిరెడ్డి వనిత సర్వసభ్య సమావేశం ముగిస్తున్నామని చెప్పడంతో వచ్చిన కొంతమంది ప్రజాప్రతినిధులు ఖంగుతిన్నారు. 23 గ్రామాల సర్పంచులు హాజరు కావాల్సి ఉండగా కేవలం ఏడుగురు సర్పంచులు, ఆరుగురు ఎంపీటీసీలు హాజరయ్యారు. సభ్యులు హాజరు కాకపోవడంతో సభను అర్ధంతరంగా ముగించారు. దీంతో అసహనానికి గురైన సభ్యులు ఈమాత్రం సభను నిర్వహించడం ఎందుకని అసహనానికి గురైనట్లు సమాచారం.

అధికారులు కూడా అంతే..

సమావేశానికి హాజరైన అధికారులు కూడా గత సమావేశంలో తీర్మానాల పురోగతిని పట్టించుకోలేదు. సభకు కనీసం పూర్తి స్థాయి నివేదికలు కూడా సమర్పించలేదు. సమావేశానికి ప్రాధాన్యతే ఇవ్వలేదు. దీంతో ఎంపీపీ సమావేశం ముగుస్తున్నట్లు తెలిపారు.

సర్పంచుల పయనమెటో..


మండల సభకు సర్పంచులు గైర్హాజరు కావడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సర్పంచులు బీఆర్ఎస్‌ను వీడుతారేమో అన్న చర్చ జరుగుతోంది. అందుకే సమావేశానికి డుమ్మా కొట్టారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీకి అనుకూలంగా ఉంటేనే గ్రామ పంచాయతీలకు నిధులు వస్తాయని, వ్యతిరేకంగా ఉంటే ఇబ్బందులు తప్పవన్న ఆలోచనలో సర్పంచులు ఉన్నట్లు సమాచారం. దీంతో త్వరలోనే చాలా మంది సర్పంచులు హస్తం గూటికి చేరతారని పలువురు చర్చించుకుంటున్నారు.

మాజీలకు మండల సభ ఆహ్వాన పత్రిక

శంకరపట్నం: ఈ నెల 8న నిర్వహించే మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేరును ఎంపీడీఓ శ్రీవాణి ఆహ్వానపత్రికలో ముద్రించడం చర్చనీయాంశమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో రసమయి ఓడిపోయిన విషయం తెలిసిందే. మండల సభ తేదీని ఇటీవల అధికారులు ఖరారు చేశారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోగా, కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరనుంది. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రిగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో పనిచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుండగా అధికారులు మాత్రం గంగుల కమలాకర్‌ను మంత్రిగానే ఆహ్వాన పత్రికలో ముద్రించారు. ఆహ్వాన పత్రికలను బుధవారం ప్రజాప్రతినిధులకు అందించడంతో అధికారుల తప్పిదం వెలుగులోకి వచ్చింది. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేరు లేకుండా తప్పులతడకగా ముద్రించడం పట్ల అధికారులను కవ్వంపల్లి ప్రశ్నించారు. తీరు మార్చుకోవాలని హెచ్చరించారు.


అంతమాత్రమే హాజరైన అధికారులు, సభ్యులు, ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు


మాట్లాడుతున్న ఎంపీపీ వనిత


ఆహ్వానపత్రిక

క్లుప్తంగా

కేసీఆర్‌ను కలిసిన రవిశంకర్


కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి: బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవెల్లిలోని ఫాంహౌజ్‌లో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీచేసిన రవిశంకర్ ఓటమి పాలయ్యారు. పార్టీ ఓటమికి గల కారణాలు, పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం. సుంకె రవిశంకర్ వెంట వీర్ల వెంకటేశ్వర్‌రావు, తదితరులున్నారు.

ఆకస్మిక తనిఖీ


భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ రవీందర్

చొప్పదండి: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను ఎంపీపీ చిలుక రవీందర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూత్రశాలలు, మధ్యాహ్న భోజనం, నీటి వసతి, వంటగది, పారిశుధ్యం తదితర వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప, ప్రిన్సిపాల్ స్వాతి, ఎస్ఎంసీ చైర్మన్ శేఖర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

11న హుండీ లెక్కింపు

శంకరపట్నం: మండలంలోని మత్స్యగిరీంద్ర స్వామి హుండీ ఆదాయాన్ని ఈ నెల11న లెక్కించనున్నామని, ఈవో సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల సమక్షమంలో లెక్కింపు నిర్వహిస్తామని తెలిపారు.

జిల్లా హ్యాండ్‌బాల్ జట్టుకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ రాధాకృష్ణ

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీప్రగతి పాఠశాల విద్యార్థులు జిల్లా హ్యాండ్ బాల్ జట్టుకు ఎంపికయ్యారు. అండర్ -14 విభాగంలో జి.ఆరాధ్య, సీహెచ్ అభిషేక్, అండర్-17 విభాగంలో బి. శిరీష, డి. రామ్‌తేజ్, టి.యశ్వంత్ ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ అన్నదానం రాధాకృష్ణ తెలిపారు. ఈసందర్భంగా ఎంపికైన విద్యార్థులను బుధవారం పాఠశాల కరస్పాండెంట్ రాధాకృష్ణ, ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

రెండు గ్రామాల్లో సత్తా చాటిన కాంగ్రెస్



వీణవంక: హుజూరాబాద్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా ఢీలా పడింది. కానీ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ధీటుగా పోటీ నిచ్చింది. పార్టీకి ఓట్లు అమాంతం పెరిగాయి. మండలంలోని మామిడాలపల్లి, హిమ్మత్‌నగర్ గ్రామాల్లో కాంగ్రెస్ మెజార్టీ ఓట్లు సాధించింది. మిగిలిన గ్రామాల్లో బీజేపీ కంటే గట్టి పోటీనిచ్చింది. మామిడాలపల్లిలో కాంగ్రెస్ 899, బీజేపీ 791, బీఆర్ఎస్‌కు 845 ఓట్లు రాగా కాంగ్రెస్ 54 ఓట్ల మెజార్టీ సాధించింది. ఉపఎన్నికల్లో బీజేపీ ఆధిక్యాన్ని ప్రదర్శించగా ఈసారి కాంగ్రెస్ సత్తా చాటింది. అదేవిధంగా టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ సొంత గ్రామం హిమ్మత్‌నగర్‌లో కాంగ్రెస్ 11ఓట్ల మెజార్టీ సాధించింది. గంగారం, రెడ్డిపల్లి, ఘన్ముక్కుల, కిష్టంపేట, నర్సింగాపూర్, శ్రీరాములపేట, గ్రామాలలో కాంగ్రెస్ రెండో స్థానంలో నిలిచింది. ఇక్కడ బీజేపీ మూడో స్థానంతో సరిపెట్టుకుంది. బేతిగల్ గ్రామంలో బీఆర్ఎస్‌కు గట్టి పోటీనిచ్చింది. బలమైన క్యాడర్ లేకున్నా కాంగ్రెస్ ఓటు బ్యాంకును రాబట్టింది.

ఇంటి నంబర్లు కేటాయించాలని వినతి

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని 265 సర్వే నంబర్‌లో నిర్మించిన ఇళ్లకు నంబర్లు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలు రాము, నగునూరి శ్రీనివాస్ బుధవారం పంచాతీ కార్యదర్శి మహేందర్‌రావును కోరారు. ఏళ్లుగా ఇంటి నంబర్లు కేటాయించడం లేదన్నారు. దీంతో విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం లేదని, ఏళ్లుగా అంధకారంలో మగ్గుతున్నారని తెలిపారు. ఇళ్లు నిర్మించుకున్నవారికి నంబర్లు కేటాయించాలని వినతిపత్రం సమర్పించారు. శాశ్వత ఇంటినంబర్లు కేటాయించడం వీలుకాని పక్షంలో తాత్కాలిక నంబర్లు ఇవ్వాలని విన్నవించారు. వినతిపత్రం ఇచ్చినవారిలో మాతంగి హరీశ్, బొర్ర భూమయ్య పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న పోలు రాము

కురుమ యువసేన వెల్ఫేర్ సంఘం నూతన కార్యవర్గం


కొత్త కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న వీరయ్య

రామడుగు: రామడుగు కురుమ యువసేన వెల్ఫేర్ అసోసియేషన్ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కడారి రాజు, ఉపాధ్యక్షుడిగా ఈరల్ల కుమార్, ప్రధాన కార్యదర్శిమొగిలి శంకర్ కోశాధికారిగా కడారి శ్రీనివాస్, కార్యదర్శులుగా మొగిలి సంపత్, ముత్త శ్రీనివాస్, ఈరల్ల అనిల్, గుమ్ముల సాగర్, సలహాదారుడిగా భూమల్ల రాయుడు ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గ సభ్యులను సంఘం జిల్లా నాయకులు కడారి వీరయ్య సన్మానించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

హుజూరాబాద్: పట్టణ శివారులోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్ష ప్యాడ్ల పంపిణీ చేశారు. ఈసందర్భంగా ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ పరీక్ష ప్యాడ్లు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్స్ జి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.


పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న జగదీశ్వర్

అనారోగ్యంతో అంగన్‌వాడీ ఆయా మృతి

చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామం అంగన్‌వాడీ కేంద్రం- 1 ఆయా బరిగెల లచ్చవ్వ (65) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. లచ్చవ్వ కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్సకు వేల రూపాయలు ఖర్చు చేసిన ఫలితం లేకుండా పోయిందని, ఆమె మృతి తీరని లోటని సర్పంచ్ పిట్టల రజిత, ఉపసర్పంచ్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మృతదేహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉన్నారు.

విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు సమావేశం



గంగాధర: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు సమావేశం నిర్వహించనున్నామని విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ వేణు గోపాలచారి, ఏడీఈ సాగర్ పేర్కొన్నారు. సమావేశంలో వినియోగదారుల సమస్యలపై చర్చించి పరిష్కరించనున్నామని పేర్కొన్నారు. ఉదయం పదిగంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు నిర్వహించే సమావేశంలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొంటారని, వినియోగదారులు సమావేశానికి హాజరై సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పోరాడినవే ఇప్పుడు సవాళ్లు


రెండేళ్లుగా మరమ్మతుకు నోచుకోని ఎల్లమ్మ చెరువుకట్ట

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు సమస్యలు స్వాగతం
- సకాలంలో పరిష్కరిస్తారని ప్రజల ఆశాభావం

గంగాధర: రెండుసార్లు చొప్పదండి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడినా పదేళ్లుగా ప్రజల మధ్యే ఉంటూ సమస్యలపై పోరాటం చేశాడు. మూడోసారి కాంగ్రెస్ పార్టీ తరపున మేడిపల్లి సత్యం పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందాడు. కానీ గత పదేళ్లలో ఏ సమస్యలపై పోరాటం చేశాడో అవే ఎమ్మెల్యేకు స్వాగతం పలకనున్నాయి. అంతేకాకుండా వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత ఆయనపైనే ఉంది. ముఖ్యంగా ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించిన సమస్యలను ఎంతకాలంలో పరిష్కరిస్తాడోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్ కుడి, ఎడమల కాలువల నిర్మాణ పనులతో పాటు అనుబంధ కాలువల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. రిజర్వాయర్ నిర్మాణంతో భూములు కోల్పోతున్న వారికి పూర్తి స్థాయిలో పరిహారం రాలేదు. నారాయణపూర్, చర్లపల్లి(ఎన్), మంగపేట, ఇస్తార్‌పల్లి గ్రామాలను ముంపు గ్రామాలుగా ప్రకటించాలి. సంబంధిత గ్రామాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలి. గంగాధర ఎల్లమ్మ చెరువుకు గండిపడి రెండేళ్లు కావస్తోంది. మరమ్మతు పనులు చేపట్టాలి. మండలంలోని గర్శకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని, మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలనే ప్రధాన డిమాండ్లు ఉన్నాయి. కురిక్యాల -గర్శకుర్తి గ్రామాల మధ్య రోడ్డు పనులు, రామడుగు మండలంలోని వెదిర గ్రామం నుంచి గంగాధర మండలంలోని హిమ్మత్‌నగర్, రంగరావుపల్లి గ్రామాల నుంచి ఉప్పరమల్యాల శివారు వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ రోడ్డుపై కంకర తేలి తరుచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గంగాధర-ఇస్తార్‌పల్లి గ్రామాల మధ్య వాగుపై బ్రిడ్జి నిర్మాణం, లక్ష్మీదేవిపల్లి గ్రామ శివారులో బ్రిడ్జి నిర్మాణం పనులు సైతం పెండింగ్‌లో ఉన్నాయి. మండలంలోని సమస్యలను ఎమ్మెల్యేగా గెలిస్తే పరిష్కరిస్తానని మేడిపల్లి సత్యం ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నుంచి గెలుపొందడమే కాకుండా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరనుంది. ఇక సమస్యలు సకాలంలో పరిష్కారమవుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


ఇల్లందకుంటలో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి

చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో బుధవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా అంబేడ్కర్ చిత్రపటం, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. దేశానికి, ప్రజలకు చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం పలువురు మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ తన జీవితం త్యాగం చేసిన మహనీయుడని, ఆయన ఆశయాలను కొనసాగించాలని కోరారు. ఈకార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్


తిమ్మాపూర్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సంఘం భవనంలో


రామడుగు: గోపాల్‌రావుపేటలో నాయకుల నివాళి


హుజూరాబాద్‌రూరల్: వీఎస్ఆర్ కళాశాల ఆవరణలో..


జమ్మికుంటలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడి ఆధ్వర్యంలో..


శంకరపట్నంలో నివాళి అర్పిస్తున్ననాయకులు


గంగాధర: నివాళి అర్పిస్తున్న సుంకె రవిశంకర్


హుజూరాబాద్ నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


చిగురుమామిడిలో జెడ్పీటీసీ రవీందర్, నాయకులు


గన్నేరువరంలో...


హుజూరాబాద్: నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్..


రామడుగులో నివాళి అర్పిస్తున్న ఎంపీపీ కవిత


చొప్పదండిలో...


తిమ్మాపూర్: మహాత్మానగర్‌లో..


సుభాష్‌నగర్ స్టేజీ నుంచి తిమ్మాపూర్ గ్రామంలోకి వెళ్లే రోడ్డు పక్కన ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

భయపెడుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు

తిమ్మాపూర్: మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల పక్కన ఉన్న ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లతో పాదాచారులు, వాహనదారులు భయపడుతున్నారు. చేతికందే ఎత్తులో ఎలాంటి రక్షణ కవచం లేకుండా ఉన్నాయని, ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని లేదంటే పక్కనే ఏర్పాటు చేసిన దిమ్మెలపైకి మార్చాలని ట్రాన్స్‌కో అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.